# బంధు దర్శనం

శ్రీ కొడవటిగంటి కృష్ణమూర్తి

"మీ తమ్ముడు వచ్చారు!" అంది సీత, భర్త లోపలికి రాగానే.

"ఫాట్!" అన్నాడు చిరునవ్వుతో సుబ్బారావు, గదిమధ్య ఆగి భార్యవంక చూస్తూ. కొంకెకు తగిలించబోతున్న వుత్తరీయం అతనిచేతుల్లో అలాగే వుంది పూలదండమాదిరిగా. "ఎప్పుడు వచ్చాడు?"

"ఇందాకనే."

"ఎక్కడికి వెళ్లాడు?"

"ఏమో!"

"ఎందు కొచ్చినట్టే వీడూ!" అన్నాడు చొక్కా, బనీనుకూడ కొంకెకు తగిలించి భార్య కెదురుగా చతికిలబడి, వొళ్లంతా పొడిచేతులతో తోముకుంటూ.

"నిలుచున్నావేం, కూచో! వంటయిందా?"

"ఆ!"

"వీ డెప్పు డొస్తాడో మళ్లీ?"

"ఆ, ఇప్పుడే వస్తారు!"

"ఏ సినిమాకి వెళ్లాడో! ఎంతసేపని కనిపెట్టుకుంటాం?"

"రవికగుడ్డ తెచ్చారా?"

"ఆ! మరిచేపోయినా!"

"అయిందీ?" అంది సీత భర్త లేస్తుండగానే. సుబ్బారావు లేచి విడిచిన చొక్కా పక్కజేబులోంచి కాగితంపొట్లం సీతముందర పారేశాడు. అలమారులో కెళ్లి చిన్న డైరీ, పెన్సలూ తెచ్చాడు.

"ఇంతలోకే 'అయిందీ' అని ఏడవకపోతే కొంచెము సేపు నిదానించరాదూ! నువ్వు చెప్పినవి ఏవీ పొరపాటునన్నా మరిచిపోగూడదు." సుబ్బారావు డైరీ తీశాడు.

"ఎబ్బే! ఇలాంటిది తెచ్చారేం?"

"ఎబ్బే ఏమిటి నీ మొహం! పెట్టే గుడ్డ కూడా సిల్కుదే కావాలీ? ఎక్కడినించి తెచ్చిపెడతాం ప్రతివాళ్లకీ?"

"సిల్కు లెవరు తెమ్మన్నారు? ఏదో ఒక మాదిరిది తెస్తే సరిపోయేది" అంది సీత పెదిమలు మడుస్తూ!

సుబ్బారావు లెక్క పూర్తిచేసి లేచి వెళ్లి పర్సుతీసి లాంతరుముందర నాలుగు అణాలూ, రెండు బేడలూ, ఒక దమ్మిడీ, మూడు కాన్లూ కుమ్మరించాడు. లెక్కవంక చూచాడు. కప్పువంక సగం మూతలుపడ్డ కన్నులతో చూస్తూ ఆలోచించటం మొదలుపెట్టాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంది సీత.

"ఒక కానీ తేలలేదు!" అన్నాడు సుబ్బారావు తల అలాగే వుంచి భార్యవంక చూస్తూ.

"మరిచిపోయినా! ఇందాక పూలు కొన్నా!" సుబ్బారావుకళ్లల్లోకి వెలుగు వచ్చింది.

"నీ కెన్నిసార్లు చెప్పినా బుద్ధిలేదు కదా! డబ్బులు తీసుకో-ఖర్చు చెయ్యి! నీ యిష్టం వచ్చినట్టు వాడు. నే నెప్పుడన్నా వద్దన్నానా? కాని ఇంటికి రాగానేమటుకు నాకు చెప్పు-లేకపోతే లెక్క ఎలా తేలుతుంది?"

"పొరబాటే నంటినిగా!" సుబ్బారావు భార్యవంక చూచి తృప్తిపడి డబ్బులన్నీ పర్సులో పోసి లేచి వెళ్లబోతుండగా "ఒక్క కానీ లెక్క తేలకపోతే ఏమిటేం?" అన్నది సీత.

"ఏమిటే" అంటూ వెనక్కు తిరిగాడు సుబ్బారావు.

"ఎందుకొచ్చిన లెక్క?"

"ఎంత ఖర్చు పెట్టేదీ తెలీకుండానే మావాడికి మల్లేనే వుండమంటావేం ? వాడికి ఖర్చు అయ్యేది ఎంతో తెలీదు, ఇతరులకు ఖర్చు అయ్యేది ఎంతో తెలియదు!" వెళ్ళి పర్సు అలమారులో పెట్టివచ్చాడు.

"మరచిపోయినా! మీతమ్ముడు జిలేబీ తెచ్చారు మనమ్మాయికి!"

"ఏమిటే, చెప్పవేం ? ఏదో విశేష మున్నదన్నమాటే! ఏదీ ఇలా తీసుకురా!" సీత పొట్లం తెచ్చి భర్తచేతి కిచ్చింది.

"బాగానే వుంది!" అన్నాడు సుబ్బారావు కొంచెం నోట్లో వేసుకుని. "ఇంకా స్తతె స్తే పీడిపొమ్మేం పోయిందీ-అణేగా! వీడు ఎప్పుడేది చేసినా ఇంతే. పిల్లలువున్న ఇంటికి వట్టిచేతులతో వెళ్లితే ఏంబాగుంటుంది? వీడి కాసంగతి తెలీనే తెలియదు. నే ననేక సార్లు చెప్పాను, వాడికి తెలిస్తేనా? ఇవాళమరి ఏబుద్ధి నున్నాడో ఇది తెచ్చాడు—ఏం ఇంకా స్త తె స్తే!"

"అయ్యో!" అంది సీత.

"అరెరె!" సుబ్బారావు ఆఖరు జిలేబీముక్క నోట్లో వేసుకుని నములకుండా భార్యవంక చూచాడు. "పొరబాటు అయిపోయింది! రేపు నేను తెచ్చి పెడతాలే!"

"తెచ్చిపెట్టాలి!" అంది సీత విసుగ్గా.

"ప్రతిచిన్న విషయానికీ అలా ఏడుస్తావేం అంట! వాడు తెచ్చిపెట్టలేదు అనుకో! పొరబాటు అయిందని చెపితిని. మనమ్మాయి తినటం ఇష్టంలేకనా ఏమిటి—"

"నేను తినలేకేనా ఏమిటి మీవాడికా అట్టే పెట్టింది?" అంది సీత.

"రేపు రెండింతలు తెచ్చిపెడతా లెద్దూ! వీడు వచ్చేటట్టు లేడే!"

"ఆ! ఎందుకురాడు!"

"వీడెందుకో వచ్చింది తెలుసునా? సినిమా చూడ్డానికి! సినిమా చూడ్డానికి ఆవూరినించి ఈ వూరు రాకపోతేనేం? పైగా ఖర్చు అందరికీ వీడే పెడతాడు. అయినవాళ్లకు పెట్టినా అర్థంవుంది-మళ్లీ తిరిగన్నా పెడతారు, ఇవాళ కాకపోతే రేపన్నా. వాళ్లకు పెడితే ఏముంది, ఈ జన్మలో తిరిగిరాదు"

"మీరు చిన్నప్పుడు మైలవరం నాటకాలకు బెజవాడ వెళ్లేవారటే? ఇతరులు మటుకు మీవంటి వాళ్లు కారూ? మీ రారోజుల్లో నాటకాల కెళ్లితే ఈ రోజుల్లో సినిమాల కాయన వెళ్లుతున్నారు. చూడటం వల్ల మీకు మొహం మొత్తినట్లు చూడకుండా ఆయనకు ఎలా మొత్తుతుంది?"

"పింజారీ, వూరుకో! నీమొహం, నీకు తెలుసూ? నువ్వు చూచావా ఏమిటి? నేను అలా ఖర్చు పెట్టేవాడినా ఏమిటి? పైగా భార్యను వంటరిగా వదలిపెట్టి నేను ఎక్కడికి వెళ్ల లేదు."

"మీరు నన్ను ఎప్పుడు సినిమాకి తీసికెళ్లారు?"

"నీమొహం! నా వుద్దేశం అది కాదు."

"మరేమిటి?"

"వాడు పెళ్లాన్ని ఒక్కత్తెనూ ఇంటో వదలి పెట్టి పొరుగూరు సినిమాకి వెళ్లటం, నేను నిన్ను సినిమాకి తీసికెళ్లకపోవటం వకటేనా?"

"పెళ్లాన్నికూడ వెంటబెట్టుకుని వెళ్లమంటారా అయితే!"

"నీమొహం—నీకు ఎంత చెప్పినా అర్థంకాదు!"

"పోనీండి—నా కెందుకువచ్చినగోల!"

"అది కాదు—"

"పోనిస్తురూ. అర్థం కాకపోతే వచ్చిన నష్టం లేదు!"

"పెళ్లానికి ఒక్కత్తెకీ భయంవేయదూ? నిజంగా ఆ బంగారంలాంటిభార్యను ఇంకో డైతే తల్లో పెట్టుకుని పూజించకూ? ఎంత న్యాయం చేసుకుంటే దొరికిందో వీడికి! చీటికి మాటికి కస్సుమంటాడు. అదైనా వంటరిగా వున్నప్పుడా — కాదు. ఒకసారి నేను వాళ్లింటికి వెళ్లా. కాళ్లు కడుక్కోటానికి నీళ్లు ఇయ్యకుండా వడ్డించింది. నానా కేకలూ వేశాడు. పాపం, నా ఎదట తల ఎత్తలేదు. నీళ్లు ఇయ్యక

పోవటం తప్పేననుకో. కేక లెయ్యాలిసినంత ఏముంది. పైగా పరాయివాళ్ళదగ్గర! వడ్డనలోనూ అంతే. కూర మారుకావాలా అని అడిగింది. తినటం అయి పోయింతరువాతవచ్చి అడుగుతావేం అని కేకలేశాడు! పోనీ, భార్యమీద ప్రేమలేదా అనుకుందామంటే మన దగ్గరేకాని చీవాట్లు, ఎప్పుడు వెళ్ళినా భార్యదగ్గరే కూచుని పిచ్చాపాటీ, అక్కచ్చుమ్మకబుర్లు మాట్లాడే వాడు. మా అందరికీ భార్యలులేరా మా అందరికీ ప్రేమలులేవా? నేనురాగానేమటుకు ఇవతలికి వచ్చేసే వాడు! మూడురోజు లున్నాను. లోపలికి వెళ్ళటానికి భయంగా వుండేది. వక్క సుగుణంమటుకు వుంది. మనం వుండగా మటుకు అలాచెయ్యడు! ఎవరైనా నలుగురిలోనూ మర్యాదగా చూచి చాటుగా చీవాట్లు పెట్టుకుంటారు భార్యల్ని. భార్యమీద ప్రేమవుంటే మటుకు పొద్దస్తమానం నవ్వులేనా? రాత్రీపగలూ కూరలూ పులుసులూ చేయించేవాడు. మనలో మనకు అవన్నీ లేకపోతే ఏం?"

"ఇప్పు డెన్నిగంట లయింది?" అంది సీత. సుబ్బారావు దీపం పైకి ఎత్తి గడియారంవంక చూచి "ఏడున్నరే!" అన్నాడు. ఎవరో బైట తలుపుతట్టారు.

"తలుపు తియ్యి!" అన్నాడు సుబ్బారావు గోడకు చేరగిలపడి.

"ఏంరోయి? ఎప్పుడు వచ్చావు," అన్నాడు కాంతం లోపలికి రాగానే.

"ఇందాకనేరా!"

"అంతా కులాసా?"

"అంతా ఎవరున్నారు, నేనూ మా ఆవిడేగా!"

"అంతా అంటే వారేనోయి! భార్య అంటే పదిమందికి లెక్క అన్నమాట!"

"అయితే అంతా కులాసాగానే వున్నారు!"

"ఏం పనిమీద వచ్చావు?"

"ఏం లేదు, వూరికేనే! దొడ్డమ్మ ఏదీ?"

"వాళ్ళింటో నవరాత్రుల్లు కాదూ. ఈ పది రోజులూ ఆ వూళ్ళోనే వుంటుంది!"

"ఎప్పుడొచ్చినా మాయింటికి రావేంరా అని చెప్పేది. తీరా ఆవిడ లేకుండానే వచ్చావే!"

"సినిమాకి వెళతావా?" సుబ్బారావు చీకటిగావున్న వంటింటివేపు తిరిగి చిరునవ్వు నవ్వాడు.

"ఆఁ, వెళదామనే వచ్చాం నలుగురం!"

"వాళ్ళేరి?"

"హోటలుకు వెళ్ళారు. నువ్వుకూడా వస్తావా?"

"మాకు ఎప్పుడూ వుండేవేగా?"

"దానికేంలే!"

"భోంచేద్దామా? వడ్డించు." సుబ్బారావు లేచి దొడ్లోకి వెళ్లాడు. సీత పీటలువేసింది.

"ఇటురా!" దొడ్లోనించికేక వినిపించింది. సీత వెళ్ళింది.

"దేనికి?"

"అక్కడ నిలుచుని అరవకపోతే ఇలా రారాదూ? కాసిని నీళ్లు తోడియ్యి.

"ఇప్పుడుకూడ నేనే తోడియ్యాలీ?– పరాయి వాళ్లున్నప్పుడు కూడా! వడ్డించ మంటిరి – పీటలు వేస్తుంటిని. ఇంతలోనే పిలవాలీ?"

"పరాయివా డేంకాదు. మా పింతల్లికొడుకే! ఎన్నడూ రాకపోవటంవల్ల నీకు అలా వుందేమో కాని!"

సుబ్బారావు కాళ్లు కడుక్కొని ఇంట్లోకి వచ్చాడు.

"ఏంరా? కాళ్లు కడుక్కున్నావా?"

"లేదురా."

"మరి కానియ్యి – ఆలిస్యం దేనికి?"

కాంతం బావిదగ్గిరికెళ్లి కాళ్లు చేతులు కడుక్కొచ్చాడు. భోజనానికి కూచున్నారు.

"రేపుంటావా?"

"రేపు సాయంత్రం వెళతాను!"

"అది ఒక్కర్తె వుండగలదూ?"

"ఆ! ఏం భయం?"

"కూర కావాలా?" అంది సీత భర్తని.

"అప్పుడేనా—అన్నం తిననిచ్చేటట్టు లేవే!"

"మీకు?"

"కొంచెం—అయ్యో అంతా వేశారే?"

"ఫరవాలేదు లే తినరా - సిగ్గుపడవోకు!"

"సిగ్గు లేదు లే!" సీత ఇంటోకి వెళ్లింది.

"ఏదీ, నాకూడ కొంచెం కూర వెయ్యి!"

"మీ అమ్మాయి కులాసాగా వుంటున్నదా?"

"ఆ!"

"ఏదీ?"

"నిద్రపోతున్నది.—నాకు కూర వెయ్యవేం?"

"కూర లేదు- అయిపోయింది" వంటింటిలో నించి సీత మెల్లిగా చెప్పింది.

"మరీ కొంచెమే చేసుకోకపోతే మరి కొంచెం చేసుకుంటే ఏం నష్టం వచ్చింది?"

"నాకక్కర్లేదురా బ్రదర్!"అన్నాడు కాంతం.

"సరిపోయింది కనక సరిపోయింది. లేకపోతే. ఆడవాళ్లకు ఎన్నన్నా చెప్పరా వాళ్లకు ఈజన్మలో తెలియదు! పైగా ఎన్నింటికని చెప్పతాము!"

"ఇంకా రెండు రోజులకు కాని రాదన్నమాట దొడ్డమ్మ?"

"అహో! ఏయ్! ఇక్కడ భోజనం పెట్టి నువ్వు లోపల అలా కూచుంటే ఎలా?"

"ఏం కావాలి?" అంది సీత.

"సా కేదన్నా వేయి మరి— ఈ నేతి అన్నం లోకి!"

"ఆవకాయ వెయ్యనా?"

"ఆ! నీకూడా కావాలిరా?"

"వద్దురా!"

"కొంచెం వేయించుకో!"

కాంతంకూడ వేయించుకున్నాడు.

"సిగ్గుపడుతున్నట్టున్నావే! వద్దంటావు-వేయించుకుంటావు!"

"అలాంటి దేం లేదులే!"

"ఇవాళ ఏమిటి సినిమా? దేని కెళతారు?"

"దేనికో దానికి-నలుగురూ దేనికైతే దానికి!"

"మజ్జిగపొయ్యి!" అన్నాడు సుబ్బారావు.

"ఇంకా పులుసుంది!"

"ఏం పులుసు? ఇందాకనే చెప్పలేదేం. నీమొహ మల్లేవుంది వడ్డన. ముందర చెప్పకపోతే ఎలా తెలుస్తుంది? కాస్త వెయ్యి!"

భోజనా లయినయి.

"ఆ మంచంమీద కూచోరా. నేనూ వస్తానులే సినిమాకి. చాలా టైము వుందిలే."

సుబ్బారావు లోపలికి వెళ్లాడు.

"ఏదీ వక్కపొడి?"

సీత తీరిగ్గా నిలుచుని తమలపాకులు చీలుస్తున్నది.

"నువ్వుకూడ సినిమాకి వస్తావా?"

"నేను రాను!"

"ఏం, వెళదాంరా!"

"అలవాటులేని అవుపోసన దేనికి?"

"ఏదైనా మంచిది వచ్చినప్పుడల్లా పంపిస్తుండమన్టేగా ప్రతిదానికీ వెళ్లటం లేదని అనేది! తృప్తి వుండాలి!"

"ఇవాళ ఏం మంచిది వుందని?"

"నలుగురం వెళ్తున్నాం గదా అని!"

"ఇదివరకెప్పుడూ నలుగురూ వెళ్లలేదా ఏం?"

"కబుర్లకేం లెండి — నేను భోంచెయ్యాలి. మీకేం, మీ దయిందికదా!"

సీత అన్నంపెట్టుకుని కూచుంది.

"అయితే మరి ఆరెవికగుడ్డ ఇచ్చేదెప్పుడు?"

"ఇంకా నాలుగురోజులు పోవాలి."

"నాలుగురోజు లుంటే అప్పుడే తెమ్మని తొందర పడ్డా వెందుకు?"

"మీ రింత తొందరగా, అడగంగానే తెస్తారని నాకేం తెలుసు?"

"ఆ డబ్బులుంటే ఇంకా దేనికైనా పనికి వచ్చేవికదా ?"

"తర్వాత కొనటానికి డబ్బులు లేకుండానా ? అక్కర్లేదులెండి, ఇప్పుడు కొనటమే మంచిది !"

"మరి నేను సినిమా కెళితే ఒక్కత్తెవూ వుండ గలవా ? మొదటి ఆటకెళితే బాగుండేది."

"మీకు బాగానే వుంటుంది. మీ రొచ్చేదాకా కనిపెట్టుకు కూచునేవాళ్లకు మాకుగాని మీకేం ?"

"సరే నేను వెళుతున్నా !"

సుబ్బారావు వచ్చాడు. వాకిలిదగ్గరే ఆగి "ఏంరా తమలపాకులు కావాలా ?" అన్నాడు.

"అక్కర్లేదురా."

"పోనీ వక్కపొడి ?"

"కొంచెం ఇలా పంపించు !"

"వక్కపొడి ఎక్కడ పెట్టావ్ ?"

"గూట్లోనే వుంది."

"తీసుకొచ్చి ఇయ్యి."

"అక్కర్లేదు లేరా."

"ఏం ?"

"ఎలాగూ కారాకిళ్లీ వేసుకోబోతున్నాంగా ! ఇప్పుడెందుకులే !"

"తలుపేసుకో ! ఏయ్ ?"

ఇద్దరూ బయలుదేరారు. కిళ్లీలకొట్టుదగ్గిర కాంతం కారాకిళ్లీ సుబ్బారావుచేతకూడ వేయించాడు. పక్కనే హోటలుఅరుగుమీద స్నేహితులు కూచున్నారు.

"బయలుదేరదాంరా." అన్నాడు కాంతం. అందరూ లేచి బయలుదేరారు. సినిమాహాలుకు చేరుకున్నారు.

"నేను తీసుకుంటాలేవోయి కాంతం" అని ఒకడు అన్నాడు. కాంతంకూడ ఒకటిక్కెట్టు తీసుకుని సుబ్బారావు కిచ్చాడు.

"ఎన్ని తీసుకున్నావ్ ?" అన్నాడు కాంతం.

"నాలుగు!"

"రండి వెళదాం !"

"అదికూడ వాడికే అంటగట్టకపోయినావూ?" అన్నాడు సుబ్బారావు.

"ఆ ఫరవాలేదులే!" అన్నాడు కాంతం.

సినిమా కాగానే ఇంటికి బయలుదేరారు.

"మేం స్కూల్లో పడుకుంటాంలే!" అన్నాడు ఒకతను కాంతంతో.

"మళ్లీ పొద్దున్నే కలుస్తాంలే!"

ఇంటికి చేరారు.

"నువ్వు ఆయింటో పడుకో!" అన్నాడు సీతని సుబ్బారావు. పిల్లని లేపి అవతల పడుకోబెట్టగానే ఏడవటం మొదలు పెట్టింది.

"వూరుకో!" అన్నాడు సుబ్బారావు. "ఏంరా నీ కింకేమన్నా కావాలా ?"

"ఏం అక్కర్లేదురా."

"సరే పడుకో!"

* * * *

"వీడింకా రాలేదు!" అన్నాడు సుబ్బారావు.

"రాలేదే!"

"నాకు వేళవుతున్నది. నాకు పెడతావా?"

"ఇంకా టైము వుందిగా ?"

"నాకు ఆకలి అవుతున్నది."

"వస్తారు లెండి, వుండండి !"

"ఆ, పెడుదూ!"

సుబ్బారావు భోంచేసి స్కూలుకు పోతూ, "చూచావా, వాడు ఇంకా రాలేదు. తినటమే మంచిదయింది. కాస్సేపు చూచి నీవుకూడా తిను !"

"నేనుకూడా తినాలి !"

"పొరుగింటి కెళ్లినప్పుడు కాస్త సర్దుకుపోవద్దూ ?"

"పొరుగిల్లేం అన్నగారేగా !" అంది సీత.

"నీ మొహం !"

" ఎవరన్నా వచ్చినప్పుడు ఆ మాత్రం సర్దుకు పోవద్దూ ?"

" ఏడిశావు. తలుపేసుకో. నే నెళుతున్నా. నువ్వుకూడా తిను ! "

*  *  *  *

సాయంత్రం సుబ్బారా వింటికి వచ్చాడు.

" మావాడు ఎన్నింటికి వచ్చాడు ? "

" అసలు రాలా !" అంది సీత ఆశ్చర్యంగా.

" ఏం ? "

" నాకు తెలుసునా ఏమిటి, నన్నడిగితే ? "

" మరి నువ్వు భోంచేశావా ? "

" పన్నెండింటిదాకా చూచి తినేశాను."

" వీడెప్పుడింతే ! రానివాడు రావని చెప్పద్దూ– వండింది దండగకాదూ"

" దండ గేముంది, పనిచేసేదాని కిస్తాను ! "

" అందుకనే నిన్నకూడ అప్పుడే తిన మన్నాను !"

---


# గనోరియాకు ఆధునిక చికిత్స




నేటి సుప్రసిద్ధ ఔషధము

ఇంగ్లీషు మరియు యితర నాటువైద్యములకు మీ చర్మవ్యాధి నివారణ కాక పుచ్చుకొన్న యింజెక్షన్లు నిష్ప్రయోజనమై యుండినయడల మేము తయారుచేసిన నేటి "గోనో కిల్లర్"ను వాడిచూడుడు. ఈ సుప్రసిద్ధమందు అన్నివిధముల చర్మబాధలను శీఘ్రకాలములో తొలగించి మీకు సౌఖ్యమునిచ్చును. యిది, స్త్రీ **పురుషులయొక్క**, మూత్రజాడ్యములకును చీముతోగూడిన వివిధ రకముల **గనేరియా-మేహరోగము**, తెలుపుపోవుట, వాపు, వీర్యముపోవుట, పొక్కులు యీ మొదలయి నవి దీనివలన నివారణయగును. వేలకొలది జనులు మా మందును వాడి సౌఖ్యము పొందినారు. దీర్ఘ వ్యాధి గ్రస్తులు యానందించినారు. కాలము పోగొట్టక మీరు యీమందును వకసారి వుపయోగించి యానందము పొందండి. 50 మాత్రల బుడ్డి యొకటికి రూ. 3/-మాత్రమే. వి. పి. పి. ప్రత్యేకము అణాలు 8.

*Sole manufacturer:*—**Dr. D. N. JASANI,**
(Dpt. B. H. M) Vithalbhai Patel Road Bombay No. 4.

Madras Agent
APPIAH & CO
China Bazaar,